క్లుప్తంగా

గడువు పొడిగింపు

కమలాపూర్: కమలాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 2వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.అనిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి ప్రవేశాల కోసం ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 చెల్లించి స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటో జత పర్చి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతర ఆదాయం రూ.2.34లక్షలు



కమలాపూర్: కమలాపూర్‌లోని సమ్మక్క గుట్ట వద్ద ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ జాతర హుండీల్లోని కానుకలను దేవాదాయ శాఖ అధికారులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. ఈసందర్భంగా రూ.2,34,050వచ్చినట్లు అధికారులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, జాతర ఉత్సవ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కుల సంఘాల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎంపీడీఓను కలిసిన మాజీ సర్పంచ్



శాయంపేట : ఇటీవల బాధ్యతలు చేపట్టిన శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎంపీడీఓ ఫణీచంద్రను శుక్రవారం మాజీ సర్పంచ్ కందగట్ల రవి, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాష్‌లు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గజ్జి ఐలయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ కందగట్ల ప్రకాష్, నాయకులు బాసాని లక్ష్మీనారాయణ, బూర కుమారస్వామి, దిడ్డి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎల్ ఉద్యోగం సాధించిన ప్రియాంక



వేలేరు: మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన దొంగరి ప్రియాంక ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఉద్యోగం సాధించింది. ప్రి యాంక చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాల్లో నే కష్టపడి చదువుకుని ఉద్యోగం సాధించింది. ప్రియాంకకు ఉద్యోగం రావడంతో మాజీ ఉపసర్పంచ్ అల్లం సతీష్, ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు యువతిని అభినందించారు.

క్షుద్ర పూజల కలకలం



ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం వంగర–మాలపల్లి గ్రామాల మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు మూఢనమ్మకాల పేరుతో క్షుద్ర పూజలు చేసి ఓ మేక పిల్లను బలిచ్చినట్లు స్థానికులు తెలిపారు. గమనించిన రెండు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు చేరుకొని సంఘటన స్థలంలో బలిచ్చిన మేక తల, మొండెం విడి భాగాలను తొలగించారు. చేతబడి పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే ఎలాంటి వారైనా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైన్స్ అభివృద్ధి చెందిన ఈ కాలంలో ఇలాంటి మూఢనమ్మకాలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు.

దరఖాస్తు చేసుకోవాలి

విద్యారణ్యపురి: పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ కులాలకు చెందిన అభ్యర్థులు హనుమకొండలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ పొందేందుకు ఆన్‌లైన్‌లో టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈనెల 10న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పించి ఉచితంగా కోచింగ్ ఇస్తారని, ఉచిత వసతి, భోజనం కూడా ఉంటుందని ఎస్సీ స్టడీ సర్కిల్ గౌరవ సంచాలకులు డాక్టర్ జగన్‌మోహన్ వివరించారు.

మహిళలు ఆదిశక్తితో సమానం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- వృద్ధులు, దివ్యాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ

పరకాల / నడికూడ: మహిళలు ఆదిశక్తితో సమానమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మహిళలపై గౌరవంతో రేవంత్‌రెడ్డి సర్కార్ ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యంతో పాటు అనేక పథకాలకు మొదటి ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఐసీడీఎస్ పరకాల ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా వీల్‌చైర్స్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో మహిళల్లో సామాజిక ఆర్థిక చైతన్యం నింపేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కృషిచేస్తుందన్నారు. సమాజంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ అత్యున్నత స్థాయికి ఎదిగిన మహిళలతోపాటు శత్రువులపై పోరాడిన చరిత్ర దేశంలో అనేకమంది మహిళలకు ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మహిళను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాను మరోసారి చాటాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి ఆధ్వర్యంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఎర్రబెల్లి భాస్కర్‌రెడ్డి, వివిధ వార్డు సభ్యులు, వందలాది మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఆయాకార్యక్రమాల్లో ఎంపీపీ టి.స్వర్ణలత, సీడీపీఓ భాగ్యలక్ష్మీ, కౌన్సిలర్ పంచగిరి జయమ్మ, దొమ్మాటి సాంబయ్య, గన్నోజు శ్రీనివాసచారి, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటస్వామి, చంద్రమౌళి, భిక్షపతి, నలుబోల కిష్టయ్య, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దామెరలో ప్రతిష్ఠాపన ఉత్సవాలు

- అగ్ని ప్రతిష్ఠ, కుంకుమార్చన కార్యక్రమాలు
- గిద్దె చెరువులో బోటింగ్ ప్రారంభం

దామెర: దామేశ్వరాలయం ప్రతిష్ఠాపన ఉత్సవాలు మండల కేంద్రంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గణపతిపూజ, అగ్ని ప్రతిష్ఠ, దేవతాహ్వానం, జలాధివాసం, సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకులు శేషు, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. మహిళలు, గ్రామస్తులు, ప్రముఖ న్యాయవాది ముద్దసాని సహోదర్ రెడ్డి, శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రామణారెడ్డి, జెడ్పీటీసీ గరిగె కల్పనకృష్ణమూర్తి, ట్రస్ట్ సభ్యులు గంగిడి శ్రీధర్ రెడ్డి, పోల్సాని అనిల్ రెడ్డి, చందుపట్ల సత్యవర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ పోలం కృపాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, దామెరుప్పుల శంకర్, మేరుగు కుమార్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

గిద్దె చెరువులో బోటుషికారు

శివుని గుట్ట.. గువ్వల బోడు మధ్యలో ఉన్న గిద్దె చెరువులో గ్రామస్తుల కోసం శివం ట్రస్ట్ ఆధ్వర్యంలో బోటింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. దీంతో బోటింగ్ చేసేందుకు ప్రజలు ఆసక్తికనబరిచారు. ప్రకృతి అందాలు తమ సెల్‌ఫోన్లలో బంధిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి, న్యాయవాది సహోదర్ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో గిద్దెచెరువు ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని అన్నారు.

మహిళలతోనే మనుగడ సాధ్యం

కమలాపూర్: మహిళలతోనే మనుగడ సాధ్యమని తహసీల్దార్ పాలకుర్తి మాధవి అన్నారు. కమలాపూర్‌లోని రైతు వేదికలో ఐసీడీఎస్ భీమదేవరపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ స్వరూప ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాధవి మాట్లాడుతూ.. నేడు సమాజం అభివృద్ధి పథంలో పయనిస్తున్నదంటే ఆ అభివృద్ధి వెనుక మహిళ ఉన్నదని, సమాజ గమనానికి మహిళే ప్రధానమన్నారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత సాధించినప్పటికి మానసికంగా వెనుకబడి ఉన్నారని, ఇలాంటి అవరోధాలు దాటుకుని మహిళలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ గుండె బాబు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం మహిళలు విద్య, రాజకీయ, ఆర్థిక పరంగా ఎదిగి ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన 10 మంది అంగన్‌వాడీ టీచర్లను, వివిధ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన అంగన్‌వాడీ టీచర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మౌటం శైలజ, ఎంపీఓ విమల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శిరీష, రేణుక, ప్రొటెక్షన్ అధికారి ప్రవీణ్‌కుమార్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం మిషన్ కో ఆర్డినేటర్ కల్యాణి, సోషల్ వర్కర్ సునీత, సఖి కేంద్రం కార్యకర్త హరిత, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవి

అమరవీరుల ఆశయాలు కొనసాగిస్తాం

- మాదిగ అమరులకు ఘననివాళి

ధర్మసాగర్: ఎస్సీల వర్గీకరణ కోసం అసువులు బాసిన అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని ఎమ్మెస్పీ జిల్లా అధికారి ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం అమరవీరుల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎస్సీల వర్గీకరణ కోసం అనేక ఉద్యమాలు చేస్తున్నారని తెలిపారు. వివిధ రూపాల్లో సాగుతున్న ఉద్యమాల్లో అనేక మంది మాదిగలు అమరులయ్యారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కొట్టె శివ, పుట్ట ప్రశాంత్,చంటీ,చిలుక రాజు, మాచర్ల బాబు, శ్రీనివాస్, చింత తిలక్, ప్రదీప్, స్టాలిన్, విశాల్, బాబు పాల్గొన్నారు

అమరవీరుల దినోత్సవం

కమలాపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోడేటి రాజు ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమరవీరులకు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పోడేటి భిక్షపతి, నాయకులు ఇంజపెల్లి రామస్వామి, శ్రీనివాస్, పోడేటి అశోక్, భూమయ్య, చిలువేరు కుమార్, పోడేటి సర్వేశ్వర్, కొలిపాక లింగయ్య, రవి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్: నివాళులర్పిస్తున్న శ్రీనివాస్



కమలాపూర్‌లో..

వర్గీకరణ సాధిస్తాం

ఐనవోలు: ఎస్సీ వర్గీకరణ సాధించి అమరవీరుల ఆత్మకు శాంతి చేకూరుస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కల నారాయణ ప్రతిజ్ఞ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకుల ఆధ్వర్యంలో అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బొక్కల నారాయణ మాట్లాడారు. చింత అశోక్, సింగారపు మాణిక్యం, కట్కూరి ప్రవీణ్, సింగారం స్వామి, ఇస్తాం బాబు, ఇల్లందుల కొమురయ్య, శ్రీను, భిక్షపతి, వెంకన్న, రితిక, చింటూ, విజయ్ పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

ఐనవోలు: మండలంలోని ఉడుతగూడెం ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధించారు. ఒక రోజు ఉపాధ్యాయులుగా పనిచేసి ప్రతిభను చాటుకున్నారు. హెచ్ఎంగా యాకర నవ్యశ్రీ, తెలుగు టీచర్లుగా అవంతిక, న్యాన్సి, ఇంగ్లీష్ టీచర్‌గా బేబి, గణిత టీచర్లుగా విష్ణువర్ధన్, కావేరి, ఈవీఎస్ టీచర్‌గా రిషిక్ కోటి, పీఈటీగా చరణ్ వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చుంచుకాల లింగారావు, ఉమాదేవి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దర్గాలో ఆర్థిక సంఘం చైర్మన్ ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న రాజయ్య

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సైలానిబాబా దర్గాలో రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రాజయ్య దర్గాలో పూలమాలలు సమర్పించారు. అనంతరం దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్‌హమీద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట ఎస్‌కే మోయిన్ తదితరులు ఉన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరిస్తాం

దామెర: ధరణిలో వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ఊరుగొండ, ముస్త్యాలపల్లిలో శుక్రవారం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఖురేషి, ఆర్ఐలు భాస్కర్ రెడ్డి, సంపత్, సిబ్బంగి మురళి, నిజాం, ఏఈఓలు ఉషారాణి, నాగరాణి, పంచాయతీ కార్యదర్శులు వేణుమాధవ రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన

ఐనవోలు: కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న ధరణిలో రైతులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి 9వ తేదీ వరకు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ విక్రమ్ కుమార్ తెలిపారు. శుక్రవారం తహసీల్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్, రెవెన్యూ అధికారులతో విక్రమ్ కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 474 ధరణిలో పెండింగ్ దరఖాస్తులను గ్రామాల వారీగా విభజన చేశామన్నారు. తహసీల్దార్, డీటీ, ఆర్ఐలతో మూడు టీంలను చేసి గ్రామాల్లోని పంచాయతీ సెక్రటరీ, ఏఈఓలతో కలిసి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. కాగా రైతులు చేసుకున్న 31 దరఖాస్తులను తొలిరోజు పరిష్కరించినట్లు తెలియజేశారు. 9వ తేది వరకు ప్రత్యేక డ్రైవ్‌లో అన్ని దరఖాస్తులను పరిష్కరిస్తామన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

చదువుపై ఆసక్తి పెంచేందుకే సహపాఠ్యాంశాలు



బొమ్మలు వేసిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శాయంపేట: విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచడానికి సహ పాఠ్యాంశాలు దోహదపడుతాయని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సహపాఠ్యాంశాల్లో భాగంగా చిత్రలేఖనం నేర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన పెయింటింగ్ బొమ్మలను ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి చూసి ప్రశంసించారు. అంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికి తీయడానికే సహపాఠ్యాంశాలు ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. చిత్రలేఖనం కళలలో ఒకటిగా భావించి.. విద్యార్థులకు నేర్పిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నిక



మధుసూదన్

ఎల్కతుర్తి: మండల కేంద్రంలోని పురుషుల పొదుపు సంఘం 20వ వార్షిక మహాసభ శుక్రవారం సంఘం ఆవరణలో జరిగింది. సంఘం ఘణకుడు రత్నాకర్ ముందుగా వార్షిక నివేదిక లావాదేవిలు చదివి వినిపించారు. అనంతరం ఒకటో పొదుపు సంఘం అధ్యక్షుడిగా పెరుగు మధుసూదన్, ఉపాధ్యాక్షుడిగా కందుకూరి శ్రీనివాస్, సభ్యులు జంపాల అశోక్, ఆడెపు వీరస్వామి, అంబాల మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సమితి అధ్యక్షుడు దేవకారి కిష్టయ్య, బచ్చు శ్రీనివాస్, ఎన్నికల అధికారి గూడెపు రమేష్, సమితి ఘణకులు హింగె రాజు, పోలు పున్నం చందర్ తెలిపారు. ఈ సందర్భంగా మధు మట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి, బలోపేతానికి సభ్యులతో కలిసి కృషి చేయనున్నట్లు తెలిపారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న కిషన్‌రావు

నడికూడ: మండలంలోని చౌటుపర్తికి చెందిన బండి మధుకర్‌ను మండల ఉపాధ్యక్షుడిగా, రగుసాల రాజును తెలంగాణ రైతు రక్షణ సమితి చర్లపల్లి గ్రామ అధ్యక్షుడిగా శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు నియమించారు. ఈమేరకు నియామకమైనవారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కార్యకర్తలకు కేటీఆర్ పలకరింపు



కార్యకర్తలతో మాట్లాడుతున్న కేటీఆర్

పరకాల: మేడిగడ్డ బ్యారేజ్ సందర్శించటానికి వెళ్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందానికి పరకాల పట్టణంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. కేటీఆర్ కొద్దిసేపు పరకాలలో ఆగి కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించారు. కేటీఆర్ వెంట మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఉన్నారు.

ప్రజలతో మమేకమైనప్పుడే అధికారులకు గుర్తింపు

శాయంపేట : ప్రజలతో మేకమైనప్పుడే అధికారులకు తగిన గుర్తింపు లభిస్తుందని ఎస్సై దేవేందర్ అన్నారు. భారతీయ జీవిత బీమా సంస్థ పరకాల బ్రాంచ్‌లో డెవలప్మెంట్ ఆఫీసర్‌గా పని చేసిన దేవరనేని వెంకటేశ్వర రావు పదవీ విరమణ ఆత్మీయ సమ్మేళన సన్మాన కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై దేవేందర్ హాజరై, మాట్లాడారు. ఉద్యోగరీత్యా పదవీ విరమణ ప్రతి ఒక్కరికీ సాధారణమని అన్నారు. భారతీయ జీవితా బీమా సంస్థలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. అనంతరం పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ చీఫ్ మేనేజర్ నాగేశ్వర్‌రావు, రిటైర్డ్ ఎస్‌బిఐ విట్టల్ రెడ్డి, రిటైర్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్‌లు హనుమారెడ్డి, సిరాజ్, ఏజెంట్లు వెన్నంపల్లి పాపయ్య, బాల్నె తిలక్‌బాబు, తాటికొండ వీరస్వామి, వడ్లకొండ భాస్కర్, నామాల రమేష్, సాంబయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వర రావు దంపతులను సన్మానిస్తున్న ఎస్సై

మార్కెట్‌లో స్మార్ట్ అగ్రికల్చర్ మెగా ఎక్స్‌పో

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని మన అగ్రిటెక్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్మార్ట్ అగ్రికల్చర్ మెగా ఎక్స్‌పోను మార్కెట్ కమిటీ సెక్రటరీ సంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశమని, ఉమ్మడి వరంగల్ జిల్లా అన్ని పంటలకు నిలయమని కొనియాడారు. నూతన టెక్నాలజీ, మారుతున్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా సైన్స్ అండ్ టెక్నాలజీని ఉపయోగించుకుని తక్కువ శ్రమతో ఎక్కువ పనిచేస్తూ మంచి ఆదాయాన్ని గడించాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు అనేక సంక్షేమ పథకాలు, రాయితీలు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తోందని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించేందుకు స్మార్ట్ అగ్రికల్చర్ మెగా ఎక్స్‌పో నిర్వహించినట్లు మన అగ్రిటెక్ ఎండీ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ పరికరాల ఉత్పత్తుల ప్రతినిధులు, మన అగ్రిటెక్ సంస్థ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు పాటుపడాలి

ఖిలా వరంగల్: ఎయిడ్స్ నిర్మూలనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ప్రొఫెసర్ నర్సింహారావు సూచించారు. తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనలో ఫార్మసిస్టుల పాత్ర, ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సును ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి తెలుసుకుని ఆ మహమ్మారిని నివారించేందుకు కృషి చేయాలని అన్నారు. ఎయిడ్స్ మహమ్మారికి మందులేదని, నివారణే మార్గమని వివరించారు. శర్మ, కమల్‌యాదవ్, జి.రమేష్, రామకృష్ణ, నాగరాజు పాల్గొన్నారు.

టీఎల్‌ఎంతో ఉత్తమ విద్యాబోధన

ఐనవోలు: టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) విరివిగా ఉపయోగించి ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధ్యమని మండల నోడల్ అధికారి(ఎంఎన్‌ఓ) ఆనందం అన్నారు. శుక్రవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ అమలులో భాగంగా ఆనందం ఐనవోలు ఎంపీపీఎస్‌ను సందర్శించి విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం నాణ్యతను పరీక్షించారు. ప్రతి తరగతిలో బాగా, యావరేజ్‌గా, అసలు చదువలేని విద్యార్థులను గుర్తించి వారిపై ఉపాధ్యాయులు చేపడుతున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు పలు సలహాలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన, ఎఫ్ఎల్ఎన్, హాజరు, పరీక్షల నిర్వహణ, మనఊరు మనబడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్ బాగుండాలంటే ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా కృషిచేయాలన్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని సూచించా రు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్, మహేందర్, బీమల్ల సారయ్య, లక్ష్మయ్య, మహేందర్‌రెడ్డి, సీఆర్‌పీ రేవతి, భవన్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఆనందం

‘అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు కాంట్రాక్టు అధ్యాపకులుగా గుర్తించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోతో కూడిన ఫ్లెక్సీకి కేయూలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, బాధ్యులు నరేందర్‌నాయక్, దేవోజీనాయక్, తిరుణహరి శేషు, రమేష్, లక్ష్మీనారాయణ, మాధవి, రమాదేవి, నవీన్, సదానందం, నాయిని వినీత, భిక్షపతి, నవీన్, రవీందర్‌రెడ్డి, శ్రీధర్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు అభినందనలు

వరంగల్ స్పోర్ట్స్: ఫిబ్రవరి 21నుంచి 25వ తేదీ వరకు పాట్నాలోని పాటలీపుత్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన 41వ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎస్.భవీల్య, కె.రవళి పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. ఈమేరకు తెలంగాణ జట్టులో కీలకంగా వ్యవహరించిన ఆ క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ సాంబశివరావు, ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి తాబేటి రాజేందర్, డాక్టర్ రతన్‌సింగ్, రవీందర్‌గౌడ్, పీఈటీ అశోక్ ఉన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు